వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 06 నవంబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 151

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



దలాల్ వీధిలో దావత్ జోష్..

మదుపర్లకు పైసల సునామీ!

మేడిగడ్డ పునరుద్ధరించకుండా

నీళ్లు ఎత్తిపోయలేం

ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

నేరుగా పంపింగ్‌కు అవకాశముంటే ఇక బ్యారేజీలెందుకు?



కన్నెపల్లి వద్ద ఎత్తిపోస్తే నీళ్లు మళ్లీ మేడిగడ్డకే వస్తాయి

మంత్రులు గోదారి ప్రాజెక్టులు సందర్శించాలి

నీరు వృథా కావట్లేదని ప్రజలకు వివరించాలి

పునరుద్ధరణ అంచనా వ్యయం రూ.4,193 కోట్లు

డిసెంబరులో పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయండి

మంత్రులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మేడిగడ్డ బరాజ్ వద్ద నీళ్లున్నా వాటిని ఎత్తిపోయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను సురక్షితంగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం సచివాలయంలో మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మేడిగడ్డ బరాజ్ వద్ద ఉన్న నీటిని ప్రస్తుత పరిస్థితుల్లో లిఫ్ట్ చేయడం సాంకేతికంగా సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

హైదరాబాద్, నవంబర్ 6 : పునరుద్ధరణ పనులు పూర్తికాకుండా మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, బ్యారేజీలు లేకుండానే పంపింగ్ చేసే అవకాశముంటే అసలు వాటిని నిర్మించడం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో భారాస చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని రాష్ట్ర మంత్రులకు సూచించారు. పరీక్షలన్నీ

మిగతా 2 లో



ఈ నెల 19 నుంచి

ఇందిరమ్మ జీవిత బీమా

అదే రోజున ఇందిరమ్మ చీరలు పంపిణీ

ఎస్సీ, ఎస్టీలకు విడివిడిగా కమిషన్లు

కాళేశ్వరం బ్యారేజీల్లో ఫౌండేషన్ లోపం

1,199 కొత్త పోస్టుల మంజూరు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఈ నెల 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సిద్దిపేటలో ప్రారంభించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మొదలవుతుందని, అదే రోజున ఇందిరమ్మ చీరలు రెండో విడత పంపిణీని ప్రారంభిస్తామని వెల్లడించారు.

హైదరాబాద్, నవంబర్ 6 : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మతులు చేసేందుకు పూర్తిస్థాయి నివేదిక వచ్చిందని, దీనిపై సుదీర్ఘంగా చర్చించి పారదర్శకంగా మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని మంత్రిమండలి తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల కోసం ఏడు ప్రాంతాల్లో రెవెన్యూ భూముల బదిలీకి, అలాగే పలుపోస్టులకు ఆమోదం తెలిపిందన్నారు. గురువారమిక్కడ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన 38వ మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పొంగులేటి

మిగతా 2 లో

రేషన్ షాపులో నిత్యావసరాలు!

సంక్రాంతి నుంచి పథకం అమలుకు ప్రతిపాదనలు..



బియ్యంతోపాటు కందిపప్పు, పామాయిల్, చింతపండు, కారంపొడి, చక్కెర, గోధుమపిండి

పరిశీలిస్తున్న సర్కారు

హైదరాబాద్, నవంబర్ 6 : పేదల కోసం ఈ నిత్యావసరాల భరోసా పథకం మళ్లీ తెరమీదకు వస్తోంది. తాజాగా ధరలు మండిపోతుండటం, ఎల్‌నినో పరిస్థితులతో ముంచుకొస్తున్న కరువు నేపథ్యంలో పేద ప్రజలకు రెగ్యులర్‌గా అందజేస్తున్న రేషన్ బియ్యంతో పాటు పలు రకాల నిత్యావసరాలనూ అందజేయాలన్న ప్రతిపాదనలను సర్కారు తీవ్రంగా పరిశీలిస్తోంది. అన్నీ అనుకున్నట్టు

-మిగతా 2 లో..



అంతరిక్ష ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా

హైదరాబాద్

హైదరాబాద్‌లో అంతరిక్ష వ్యర్థాల తొలగింపు కేంద్రం

దేశంలోనే తొలి ప్రైవేట్ బేస్1 సెంటర్

ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 5 : భారత అంతరిక్ష రంగంలో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో కాస్మో సర్వ్ స్పేస్ సంస్థ దేశంలోనే తొలి ప్రైవేట్ సమగ్ర అంతరిక్ష వ్యర్థాల తొలగింపు కేంద్రం 'బేస్ 1'ను ప్రారంభించింది. ప్రపంచంలో ఇలాంటి సదుపాయాలతో ఏర్పాటైన ఆరో కేంద్రం ఇది. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ వర్చువల్‌గా హాజరుకాగా.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ చిరంజీవి ఫణీంద్ర,

-మిగతా 2 లో..

ఐరన్ లెగ్‌గా కేసీఆర్

థర్డ్ ఫ్రంట్ అంటూ ఆయన కలిసినవారంతా ఓడిపోయారు

కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతాం

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్



హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకొంటున్న కేసీఆర్ రాజకీయంగా ఐరన్ లెగ్‌గా మారారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానంటూ దేశమంతా తిరిగి ఎవరి నైతే కలిశారో వారంతా ఓడిపోయారన్నారు. బెంగాల్‌లో మమతాబెనర్జీ, ఒడిశాలో నవీన్ పట్నాయక్,

-మిగతా 2 లో..

ఆర్నెల్లపాటు 'జలవనరుల సంరక్షణ'

2027 జనవరి నుంచి జూన్ దాకా కార్యక్రమం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 5 : ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్న దృష్ట్యా రాష్ట్రంలో జలవనరుల పునరుద్ధరణకు వివిధ కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 జనవరి నుంచి జూన్ దాకా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ ఆర్నెల్లపాటు జలవనరుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

-మిగతా 2 లో..



ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలేవీ?

'ఎక్స్'లో మోదీ, అమిత్‌షాలను ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట అవినీతికి పాల్పడుతున్నారని పదేపదే ఆరోపణలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు.. ఎందుకు ఆయనపై అవినీతి నిరోధక చర్యలు తీసుకోవడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా ఈ మేరకు మోదీ, అమిత్‌షాలకు

-మిగతా 2 లో..

నా భూములపై ఎటువంటి

విచారణకైనా సిద్ధమే

అయ్యప్ప సొసైటీలో సీఎం, ఆయన కుటుంబ దోపిడీ

రాష్ట్రానికి పైసా సాయం ప్రకటించని షా: కవిత



హైదరాబాద్, నవంబరు 5 : సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ లోని అయ్యప్ప సొసైటీని చెరబట్టిన సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. భూగర్భ జలాలు లేని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ఒక్క ఇటుక కూడా

-మిగతా 2 లో..



ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ జీవిత బీమా

(మొదటిపేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో వివరించారు. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు కలిపి ఒకటే కమిషన్ ఉందని, అందరి అభిప్రాయాల మేరకు రానున్నరోజుల్లో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. "ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్-2026 కార్యక్రమం నిర్వహించనున్నాం. దేశ విదేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన వందల మంది పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరవుతారు. ఈ ఏడాది ప్రపంచ దేశాల నుంచి భారీస్థాయిలో పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వానికి పూర్తి విశ్వాసముంది. రైజింగ్ తెలంగాణ పేరిట రాష్ట్రంలో మూడేళ్లుగా పలు కార్యక్రమాలు చేపట్టాం. పారిశ్రామిక, ఇతర సరళీకృత విధానాలను సమ్మిళితం చేసి ప్రపంచ దేశాలతో పోటీపడే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్డీఎస్ఏ అడిగిన అన్ని పరీక్షలు పూర్తిచేశాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఫౌండేషన్ లోపం ఉంది. కటాఫ్‌వాల్స్ సరిగా నిర్మించలేదు. స్పిల్‌వే వెడల్పు సరిగా లేదు. ఎగువ ప్రాంతంలో కాంక్రీటు డయాఫ్రమ్ వాల్ లేనందున బ్యారేజీల్లో నీళ్లు నిలవవద్దని గతంలో ఎన్డీఎస్ఏ ఆదేశాలు జారీచేసింది. ఆ ఆదేశాలు అమలు చేస్తూ ప్రభుత్వం అన్ని పరీక్షలు చేసింది. ఆ పరీక్షల వివరాలను ఎన్డీఎస్ఏకు ఇచ్చాం. ఆ సంస్థ సూచన మేరకు సీడబ్ల్యూసీకి అందించాం. ప్రాజెక్టులను ఎలా మరమ్మతు చేయాలి.. విధివిధానాలేమిటి... ఎలా ముందుకు వెళ్లాలన్న నివేదిక వచ్చింది. ఈ నివేదికపై సుదీర్ఘంగా చర్చించి... పారదర్శకంగా ప్రాజెక్టుల మరమ్మతులు చేయాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. దీపావళి రోజున రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈనెల 7, 8, 9 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పర్యటిస్తారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ఎక్స్‌పో ఉంటుంది. ఈనెల 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ ఉంటుంది. పండగరోజున సీఎం నుంచి సర్పంచ్ వరకు వారి పరిధిలో ఒక ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. తొలివిడతలో మంజూరైన వాటిల్లో ఇప్పటికే 2.25 లక్షల గృహాలు పూర్తయ్యాయి. ప్రభుత్వంలో వివిధ శాఖల్లో కొత్తగా 1,199 పోస్టులను మంత్రిమండలి మంజూరు చేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో 886, ఫుడ్ సేఫ్టీలో 177, న్యాయ శాఖలో 136 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు మంత్రివర్గం ఆదేశాలిచ్చింది" అని మంత్రి పొంగులేటి వివరించారు.

మేడిగడ్డ పునరుద్ధరించకుండా నీళ్లు ఎత్తిపోయలేం

(మొదటిపేజీ తరువాయి)

ముగిసి డిజైన్ల ఖరారు, అంచనాల తయారీ కొలిక్కి వచ్చినందున వీలైనంత త్వరగా బ్యారేజీ పునరుద్ధరణ పనులు ప్రారంభించి వచ్చే వానాకాలం సీజన్‌కు వినియోగంలోకి తేవడానికి గట్టి ప్రయత్నం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రికి, అధికారులకు సీఎం సూచించారు. కన్నెపల్లి వద్ద పంపింగ్ చేసి అన్నారానికి పంపినా, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకు బ్యారేజీ గేట్లు తెరిచే ఉంచాల్సి ఉందని, దీంతో ఎత్తిపోసిన నీళ్లు తిరిగి మేడిగడ్డకే వస్తాయని సీఎం తెలిపారు. ఈ విషయం తెలిసి కూడా భారాస నాయకులు పనిగట్టుకొని రోజూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, మంత్రులు, పార్టీ యంత్రాంగం దీన్ని తిప్పికొట్టాలని రేవంత్ పేర్కొన్నారు. గురువారం మంత్రివర్గ సమావేశానికి ముందు.. సచివాలయంలోనే మంత్రులందరితో సీఎం భేటీ అయ్యారు. తొలుత గ్లోబల్ సమిట్ గురించి చర్చించిన తర్వాత కాళేశ్వరంపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌లు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీల దుస్థితిపై మంత్రులకు ఎలాంటి సమాచారం అవసరమైనా అధికారులు ఇస్తారని, అందరూ అవసరానికి తగ్గట్లుగా స్పందించాలని కోరారు. ఎన్‌డీఎస్ఏ, టెక్నికల్ ఓవర్ సైట్ కమిటీ (టీఓసీ) సిఫార్సుల మేరకే ముందుకు వెళ్లాలని, ఎక్కడా దారి తప్పవద్దని, పునరుద్ధరణ జరిగే సమయంలోనూ వారిని భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ఓ మంత్రి కోరారు. బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం లేకపోవడానికి కారణాలను విశ్లేషిస్తూ నీటిపారుదలశాఖ సంయుక్త కార్యదర్శి (టెక్నికల్) కె.శ్రీనివాస్, పునరుద్ధరణ పనులు, డిజైన్లు, అంచనా వ్యయం తదితరాలపై ప్రత్యేక కార్యదర్శి కర్నల్ పరీక్షిత్ మెహ్రోలు ప్రజంటేషన్ ఇచ్చారు. మేడిగడ్డ నుంచి ఎత్తిపోసిన నీటిని అన్నారంలో నిల్వచేసి సుందిళ్లకు ఎత్తిపోయాలంటే అన్నారం బ్యాక్‌వాటర్ 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంప్‌హౌస్ వరకు ఉండాలని, ఎన్‌డీఎస్ఏ సిఫార్సు మేరకు అన్నారం బ్యారేజీ గేట్లు తెరిచి ఉంచాల్సి ఉన్నందున.. ఎత్తిపోసిన నీళ్లు తిరిగి మేడిగడ్డకు చేరతాయని, అన్నారం నుంచి ఎత్తిపోయడం సాధ్యం కాదని వారు వివరించారు. పునరుద్ధరణకు సంబంధించిన పరీక్షలు, డిజైన్ల ఖరారు, అంచనాలు.. ఇలా అన్ని



అంశాలను విశదీకరించారు. పునరుద్ధరణ పనులకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో అంచనాలు పెట్టి ఆమోదింపచేసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశానికి సంబంధించి సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. మేడిగడ్డ పునరుద్ధరణ పనులు డిసెంబరులోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. మేడిగడ్డ వద్ద కనిపించే నీటిని ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

సీఎం మాట్లాడుతూ.. 'దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసి ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగు.. తాగునీటిని అందించాం. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే.. గత మూడేళ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేశాం. అక్టోబరు నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీలను సద్వినియోగం చేసుకున్నాం' అని వివరించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని వివరించారు. 'తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరవు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావు. ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలి' అని సీఎం ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ... 'బ్యారేజీల సమగ్ర అధ్యయనం, పరిశోధనలు పూర్తయ్యాయి. పునరుద్ధరణ ప్రాథమిక ప్రణాళికలకు నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపింది' అని వివరించారు.

పునరుద్ధరణ అంచనా వ్యయం రూ.4,193 కోట్లు

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ వ్యయం పన్నులతో సహా రూ.4,193 కోట్లు అవుతుందని, పన్నులు లేకుండా రూ.3,200 కోట్లుగా ఉందని అధికారులు వివరించారు. సంబంధిత మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణసంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సీఎం స్పందిస్తూ.. పునరుద్ధరణ పనుల తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతో పాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. భద్రతాప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సీఎం స్పష్టం చేశారు. సమావేశంలో నీటిపారుదలశాఖ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

ఇస్రో మాజీ డైరెక్టర్ ఎ.కె. అనిల్‌కుమార్, ఇస్రో అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ శేషగిరిరావు, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్ ఐటీ శాఖ మంత్రి సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. వ్యోమగాములు రాకేశ్ శర్మ, శుభాంశు శుక్లా వర్చువల్‌గా పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "హైదరాబాద్‌లో 30కి పైగా స్పేస్‌టెక్ సంస్థలు ఉన్నాయి. అంతరిక్ష ఆవిష్కరణలకు దేశంలోనే కీలక కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోంది. ప్రత్యేక స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సాధిస్తున్న పురోగతికి కాస్మోసర్వ్ బేస్ 1 వంటి అత్యాధునిక కేంద్రాలు నిదర్శనం" అని అన్నారు. ప్రస్తుతం సంస్థ తన మిషన్ విడిభాగాల్లో 60% స్థానికంగానే సమకూర్చుకుంటోంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. రెండు అంతరిక్ష వాహనాలతో 100 ఉపగ్రహాలకు సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ఒక్కో ఉపగ్రహానికి అయ్యే ఖర్చును 10 మిలియన్ డాలర్ల నుంచి 1 మిలియన్ డాలర్ల కంటే తక్కువకు తగ్గించాలని భావిస్తోంది. 2027లో పూర్తిస్థాయి అంతరిక్ష వ్యర్థాల తొలగింపు ప్రదర్శన చేపట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది.



ఐరన్ లెగ్‌గా కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఏపీలో జగన్ మోహన్‌రెడ్డి, చివరకు తెలంగాణలో కేసీఆర్ కూడా ప్రజల చేతిలో ఔటయ్యారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగులేని ప్రత్యామ్నాయం బీజేపీయేనని, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, తప్పిదాలు, దుర్మార్గపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామన్నారు. ఒక వైపు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశ సమస్యలను వదిలేసి సగం కాలం అమెరికా, యూరోపలలో గడుపుతుంటే, మరో వైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి ఢిల్లీ పర్యటనలకే పరిమితం అయ్యారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వీడి యువత తమ పార్టీలో చేరుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. పాతబస్తీ నుంచి గురువారం పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారన్నారు.

ఆర్నెల్లపాటు 'జలవనరుల సంరక్షణ'


(మొదటిపేజీ తరువాయి)

వచ్చే ఏడాది జనవరి నుంచి జూన్ దాకా వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కలిసి సంయుక్తంగా జలపునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామస్థులను, ప్రధానంగా వ్యవసాయ కూలీలను భాగస్వాములు చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో వల్ల ఉపాధి కోల్పోయే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేలా పనులు చేపట్టాలని, చెరువుల్లో పూడికతీత, చెక్‌డ్యాంల నిర్మాణం, దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు వంటివి చేపట్టాలన్నారు. భూగర్భ జలాల పెరుగుదల కోసం చతుర్విద జలప్రక్రియ వంటి కార్యక్రమాలు అమలుపై అధ్యయనం చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

రేషన్‌లో నిత్యావసరాలు!

(మొదటిపేజీ తరువాయి)


జరిగితే సంక్రాంతి నుంచే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమలు చేస్తే గనక బియ్యంతో పాటు గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్, చింతపండు, కారంపొడి, చక్కెరను పంపిణీ చేయాలని సర్కారు ఇప్పటికే ఓ ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతానికి ప్రజా పంపిణీ పథకం (పీడీఎస్) లబ్ధిదారులకు బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. కుటుంబంలో తలా ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బియ్యంతో పాటు ఇతర నిత్యవసరాలను కూడా పేదలకు అందజేస్తామని చెబుతోంది. తాజాగా కరువు పరిస్థితులు ఏర్పడటంతో ఈ ప్రతిపాదన మరోసారి తెరపైకొచ్చింది. రాష్ట్రంలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులున్నాయి. వీటి కింద 3.42 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు.వీరికి నెలకు 2.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఆహార భద్రత పథకం కింద ఇతర నిత్యావసరాలను పంపిణీ చేయాల్సి వస్తే ఎన్ని రకాల వస్తువులను ఇవ్వాలి? ఎంత పరిమాణంలో ఇవ్వాలి? ఎంత కాలం పాటు ఇవ్వాలి? అందుకు బడ్జెట్ ఎంతవుతుంది? అనే అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బియ్యంతోపాటు గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్, చింతపండు, పంచదార, కారంపొడి పంపిణీచేయాలని ప్రాథమికంగా ఓ




ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఈ నిల్వలు క్షేత్రస్థాయిలో ఉన్నాయా? లేకపోతే ఎలా సేకరించాలి? అనే అంశాలపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. యాసంగి సీజన్‌లో పంటలు సాగుచేయలేకపోతే ఇంకో రెండు నెలలు చూసి నిత్యావసర వస్తువుల పంపిణీ మొదలుపెట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఆ రకంగా వచ్చే సంక్రాంతికి ఈ పథకాన్ని ప్రారంభించాలనే ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే 24 గంటల డెడ్‌లైన్: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : అరెస్టులు, నిర్బంధాలు, న్యాయస్థానాల ముందు హాజరుపర్చే విషయంలో 24 గంటల గడువు వంటి అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే.. అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడానికి రాజ్యాంగం విధించిన 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభం అవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు చేసినప్పటి నుంచి కాకుండా అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే ఆ సమయాన్ని లెక్కించాలని తేల్చిచెప్పింది. "అధికారికంగా అరెస్టు జరిగినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభం అవుతుందనే అభిప్రాయం భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లకు విరుద్ధం. అదుపులోకి తీసుకోవడానికి, అరెస్టుకు మధ్య వ్యత్యాసాన్ని చూపించి న్యాయపరమైన విచారణను ఆలస్యం చేయడానికి అధికారులకు అనుమతిలేదు. ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా నిలిపివేయడం, ఆలస్యం చేయడం రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో చెల్లదు. వ్యక్తులను కోర్టులో హాజరుపర్చినప్పుడు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్లు కచ్చితంగా నమోదు చేయాలి. 24 గంటల నిబంధన పాటించారో లేదో పరిశీలించాలి" అని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. 24 గంటల డెడ్‌లైన్ విషయంలో ఒరిస్సా హైకోర్టు, మద్రాస్ హైకోర్టు, కేరళ హైకోర్టు వెలువరించిన అభిప్రాయాలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అధికారిక అరెస్టుకు ముందు నిర్బంధంలో ఉన్న కాలాన్ని మినహాయించడానికి ఆయా న్యాయస్థానాలు గతంలో అనుమతించాయి. దీన్ని అత్యున్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి కోర్టు వరకు ప్రయాణానికి పట్టే సమయాన్ని మినహా ఇంకే మినహాయింపులు



ఉండకూడదని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణ సందర్భంగా సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. త్రిపురలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో గతేడాది సెప్టెంబర్ 29న మధ్యాహ్నం సమయంలో నిందితుడు సుజిత్‌దాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే సెప్టెంబర్ 30 ఉదయం మాత్రమే అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. అయితే ఉద్దేశపూర్వకంగానే రికార్డుల్లో అరెస్టు సమయాన్ని ఆలస్యంగా చూపించారని నిందితుడి తరఫు న్యాయవాదులు వాదించారు. ఇది రాజ్యాంగంలోని నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందంటూ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. కానీ, అధికారికంగా అరెస్టు చేసిన సమయం నుంచే 24 గంటల గడువు వర్తిస్తుందని ధర్మాపీఠ సంస్థలు కోర్టుకు విన్నవించాయి. దీన్ని న్యాయస్థానం తోసిపుచ్చింది. అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డెడ్‌లైన్ వర్తిస్తుందంటూ తాజాగా తీర్పునిచ్చింది.



నా భూములపై ఎటువంటి విచారణకైనా సిద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

పేర్చొద్దని హైకోర్టు ఆదేశం ఉన్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అయ్యప్ప సోసైటీలోని గురుకుల ట్రస్టు భూముల్లో వచ్చిన 500-700 అక్రమ నిర్మాణాలకు సీఎం సోదరులే అనుమతులిప్పిస్తూ కమీషన్లు దండుకుంటున్నారని కవిత గురువారం టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో చెప్పారు. మునిసిపల్‌శాఖ తన వద్ద పెట్టుకున్న సీఎం.. పెద్ద బిల్డర్లకు సహకరిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అనుమతించిన 700 నిర్మాణాలకు చేస్తున్న నోటరీ రిజిస్ట్రేషన్లు చెల్లవని, ఎవరూ అయ్యప్ప సొసైటీలో ఇళ్లు కొనవద్దన్న కవిత.. ఈ ప్రాంతంలో సమగ్ర సర్వే చేసి అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని డిమాం డ్ చేశారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఉన్నా.. ప్రయోజనం లేకపోయిందని, 18 వేల అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తన వద్ద ఇంకు అసైన్స్/ ఇనాం భూములున్నా ప్రభుత్వానికే రాసిస్తానని చెప్పారు. తన భూములపై ఎటువంటి విచారణకైనా సిద్ధమేనన్నారు. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో 320 మండలాల్లో కరువు ఉంటే, హైద రాబాద్ కొచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పైసా సాయం ప్రకటించలేదని కవిత ఆరోపించారు.



ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలేవీ?

(మొదటిపేజీ తరువాయి)

గురువారం పలు ప్రశ్నలు సంధించారు. "హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా ఆర్ఆర్ ట్యాక్స్ వాస్తవమేనని చెబుతారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి.. హైదరాబాద్‌లో పర్యటించిన ప్రతిసారి ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తుంటారు. మరి ఆ వసూళ్లపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? భాజపా నేతలవి ఉత్త మాటలే. చర్యలు మాత్రం ఉండవు. ఇందుకు కారణం.. భాజపా, కాంగ్రెస్ మధ్య ఉన్న అంతర్గత అవగాహనే. అందుకే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

రైతు,కూలి సంఘం నాయకుడు “అగ్గు ఎర్రన్న” మృతి.


మెడికల్ కాలేజీకి భౌతిక కాయం అందజేత.

ఘనంగా నివాళులు అర్పించిన న్యూడెమోక్రసీ, ఇతర వామపక్ష పార్టీల నేతలు.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:



కమ్యూనిస్టు ఉద్యమంలో, రైతు కూలీ సంఘం పోరాటాలలో గత 40 సంవత్సరాలుగా కీలకంగా పాల్గొన్న అగ్గు ఎర్రన్న గురువారం అనారోగ్యంతో వైద్యం పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్ తో హఠాత్తుగా మరణించారు. ఆయన మృతికి సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, నూడా చైర్మన్ కేశ వేణు, వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, పాల్గొని ప్రసంగించారు.“ఎర్రన్న గ్రామంలో ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా పలకరించేవారన్నారు. ప్రతి ఒక్కరి నోట్లో నాలుకలాగా ఉండే వ్యక్తి అని, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడారన్నారు.. ఆయన లాంటి నాయకుడిని కోల్పోవడం ఉద్యమానికి తీరని లోటు” అని అన్నారు.హఠాత్తుగా ఆయన మరణించడంతో గ్రామంలో చిన్న పిల్లవాడి నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ శోక సంద్రంలో మునిగిపోయారని తెలిపారు. “చనిపోయిన ఇతరులకు చూపువై, మెడికల్ విద్యార్థులకు ప్రయోగ పాఠమైన” ఎర్రన్న ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎర్రన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని నాయకులు పేర్కొన్నారు. కాగా మోపాల్ గ్రామంలోని తన ఇంటి వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. లయన్స్ క్లబ్ ద్వారా తన కండ్లను ఇతరులకు చూపు కావాలనే ఆశయంతో కండ్లను సేకరించారు. ఇంటి వద్ద సభ నిర్వహించారు. అనంతరం మోపాల్ గ్రామం నుండి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ వరకు ర్యాలీ గా వెళ్ళి అక్కడ ప్రభుత్వ మెడికల్ కాలేజీ కి ఆయన భౌతిక కాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పరుచూరి శ్రీధర్, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య, కూర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్కంటి భూమయ్యా, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, కంజర భూమయ్యా, గ్రామ సర్పంచ్ ధ్యాప రవి, అగ్గు చిన్నయ్య, బండమీద నర్సయ్య, గోవర్ధన్, పి సరిత, నీలం సాయిబాబా, లక్ష్మీ, మల్లికార్జున్, సూర్యశివాజీ, గ్రామస్తులు ఆయన అభిమానుల లతోపాటు కుటుంబ సభ్యుల భార్య అగ్గు లక్ష్మీ, కూతురు ప్రశాంతి, కుమారులు అగ్గు ప్రతాప్, ప్రదీప్ ఇతరులు పాల్గొన్నారు.



ఏఎంసీలో కార్మికుల రేట్ల ఒప్పందాలను అమలు చేయాలి.

- కార్యదర్శి కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి.

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య డిమాండ్.



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో గతంలో జరిగిన కార్మికుల రేట్ల ఒప్పందాలను అమలు చేయాలనీ, కార్యదర్శి కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలనీ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఒమయ్య మాట్లాడుతూ, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మార్కెట్ యార్డు ద్వారా లైసెన్సులు పొందిన హమాలీలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధన ప్రకారం 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీగా అనేక సంవత్సరాలుగా ఆందోళన చేయడం జరిగిందన్నారు. దాని ఫలితంగా 29-10-26 రోజున జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ సమక్షంలో చర్చలు జరిగగా, 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని అంగీకరించడం జరిగిందన్నారు. కానీ మార్కెట్ యార్డ్ కార్యదర్శి దాన్ని పక్కదోవ పట్టిస్తూ ఫిబ్రవరిలో అడిషనల్ కలెక్టర్ దగ్గర జరిగిన హమాలి, దడువాయి, చాట రేట్ల ఒప్పందంలో కూడా 50 కేజీలకు మరియు 60 కేజీలకు ఒకే రకమైన రేటు నిర్ణయమయిందన్నారు. ఒప్పందం తర్వాత విడుదలైన సర్కులర్లో మార్కెట్ యార్డ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సవరణలు చేసి 50 కేజీలు అమలవుతున్న సందర్భంగా బస్తారేట్లు తగ్గిస్తామని కార్మికులకు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో రాష్ట్ర మార్కెటు జాయింట్ డైరెక్టర్, కమిషనర్ సమక్షంలో 40 కేజీల బస్తా తూకానికే అగ్రిమెంట్లు చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి అధికారులను తప్పుదోవ పట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అడిషనల్ కలెక్టర్ చొరవ తీసుకొని హమాలి, చాట, దడువాయి లకు బస్తారేటు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెకైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి సాయిలు, కోశాధికారి నరేష్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు.

- కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్



: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్టు అమలుపై సమావేశం జరిగింది. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ గురించి కలెక్టర్ సమీక్షించారు.

ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కింద రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ తీరు పట్ల ప్రత్యేక పర్యవేక్షణ జరుపుతూ, నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని నిబంధనలు పాటించే ఆసుపత్రులకే అనుమతులు, రెన్యూవల్స్ చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ నిబంధనలు పాటించని ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయకూడదని, నిబంధలకు అనుగుణంగా సదుపాయాలు కలిగి ఉన్న వారికి నిర్దేశిత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎవరైనా అవకతవకలకు ఆస్కారం కల్పించినట్లు ఫిర్యాదులు వస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులైన అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్నట్లు అయితే వెంటనే నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా, ప్రభుత్వం రూపొందించిన కొత్త నిబంధనలపై ఆసుపత్రుల నిర్వాహకులు అవగాహన పెంపొందించుకుని, వాటిని తుచ తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. పార్కింగ్ ఏరియా, అగ్ని ప్రమాద నివారణ జాగ్రత్తలు వంటివి విధిగా పాటించాలని, అన్ని ఆసుపత్రుల్లో వైద్య రుసుముల వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్.ఎం.పి.వైద్యుల పట్ల నిఘా పెంచి అర్హత లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్న వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కాగా, రోడ్డు ప్రమాద బాధితులకు పీ.ఎం రాహత్ పథకం కింద తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు చొరవ చూపాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ, వైద్య వ్యవస్థ ప్రతిష్టను పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, నిజామాబాద్, బోధన్ ఐ.ఎం.ఏ శాఖల అధ్యక్షులు డాక్టర్ విశాల్, డాక్టర్ ముకరంజా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి.



అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.

పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

అర్బన్ నియోజకవర్గంలో కొనసాగుతున్న పనుల్లో నాణ్యత ఎంతో ముఖ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 22, 25, 35వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు 20 లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డివిజన్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. అలాగే డివిజన్కు కోటి రూపాయల పనులు కూడా కొన్ని డివిజన్లో ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. అమృత్ 2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అయితే పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి సూచించడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, కావున పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రధానంగా అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పడం జరిగిందన్నారు. అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర గల అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుందన్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన అధికారులు, కంపెనీ ప్రతినిధులు సందర్శించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 22వ డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి సుధా, 25వ డివిజన్ కార్పొరేటర్ చింతకాయల రాజేందర్, 35వ డివిజన కార్పొరేటర్ ఎర్రం సుధీర్, బీజేపీ నాయకులు పవన్ ముందడ , శ్రీనివాస్, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.





తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్, పిడిఎస్ యు మాజీ నాయకుడు చలకాని వెంకట్ యాదవ్ పిలుపు.

ఘనంగా జేసీఎస్ ప్రసాద్, విద్యార్థి అమరవీరుల వర్ధంతి.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

పాలకుల ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్, పిడిఎస్ యు మాజీ నాయకుడు చలకాని వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు. పిడిఎస్ యు ఉద్యమ నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తూ, శాస్త్రీయ విద్య, సామాజిక సమానత్వం, విద్యార్థుల హక్కులు, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం నేటి విద్యార్థి, యువత కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న విద్యార్థి అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్లో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సభను ప్రారంభించారు. ఈ సభకు పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్ అధ్యక్షత వహించగా,

స్మారక ఉపన్యాసకులుగా చలకాని వెంకట్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, యువత విద్య, ఉద్యోగం, ఉపాధి, ప్రజాస్వామిక హక్కులు, సామాజిక న్యాయం కోసం గళమెత్తుతున్నారని వివరించారు. బంగ్లాదేశ్, ఇండోనేషియా, మొరాకో, ఫిలిప్పీన్స్, నేపాల్ వంటి దేశాల్లో యువత నిర్వహించిన ఉద్యమాలను ప్రస్తావిస్తూ, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సామాజిక, రాజకీయ పరిణామాలను నేటి యువత అధ్యయనం చేయాలని అన్నారు.మాజీ పిడిఎస్ యు నాయకులు పద్మారావు మాట్లాడుతూ, జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ విద్యార్థి ఉద్యమాల్లో నిర్వహించిన పాత్రను వివరించారు. విద్యార్థి ఉద్యమాలు కేవలం క్యాంపస్ సమస్యలకే పరిమితం కాకుండా కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల సమస్యలపై కూడా స్పందించాలని అన్నారు.జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధమైన ఆలోచనా విధానం పెంపొందించాలని, మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా విజ్ఞానాన్ని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో కుల, మత, ప్రాంతీయ వివక్షలకు తావులేకుండా మానవతా విలువలను పెంపొందించాలని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. అనిల్ , పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి తో పాటు విద్యార్థి, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు పాటుపడాలి.

బీజేపీ అధ్యాత్మిక సెల్ సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:





జిల్లాలోని ఆలయాల పరిరక్షణకు పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ అధ్యాత్మిక సెల్ నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన ఆధ్యాత్మిక సెల్ హిందూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా జిల్లాలో చారిత్రాత్మక ఆలయాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటి భూముల పరిరక్షణ చేపట్టాలన్నారు. ఆలయాలపై దాడులు వ్యతిరేక కార్యకలాపాలను ఎదిరించి ఆసరాగా నిలవాలని సూచించారు. హిందువులందరినీ కలుపుకొని సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఆలయాల భూముల కబ్జాలను ఆక్రమణలను అడ్డుకోవాలని తెలిపారు. అనంతరం నూతన కమిటీలను నియమకపత్రాలను అందజేశారు

. కార్యక్రమంలో బీజేపీ అధ్యాత్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్ రావు, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, జాయింట్ కన్వీనర్ నవీన్, జిల్లా కన్వీనర్ మేఘా సుబేదార్, రాష్ట్ర సలహాదారు ఉదయ్ మహారాజు, జిల్లా కో కన్వీనర్ రాజేష్, చంద్ర కాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆవేదన సభ.. ఉద్యోగాల భర్తీకి డిమాండ్!

- ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

వేగుచుక్క న్యూస్,



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఈరోజు నిరుద్యోగుల ఆవేదన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నిరుద్యోగులను మోసం చేసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి అందించడంతో పాటు జాబ్ క్యాలెండర్ను తక్షణమే అమలు చేయాలని కోరారు.జేఎల్, డీఎల్, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ, జీపీఓ, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా నిరుద్యోగులకు నష్టం కలిగించే జీవోలను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎల్. మూర్తి -- నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, అస్మా -- నిరుద్యోగ జేఏసీ నాయకురాలు, రాజేష్ -- ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉదయ్ -- ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు, కాసర్ల మధు -- డీబీఎస్ఏ రాష్ట్ర నాయకుడు, నరేష్, జక్కుల వెంకటేష్, మహేష్, అనిల్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలకు ఇక ఫుల్ సెక్యూరిటీ !

బడ్జెట్‌కు ఢోకా లేదు.. బోర్లకు భరోసా ఇస్తామంటున్న ఉత్తమ్!

హైదరాబాద్, నవంబర్ 05:

రేపటి నీటి కష్టాలకు ఇప్పుడే చెక్ పెట్టాలె.. భూగర్భ జలాల్ని బచావ్ చేయాలె అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు హుకుం జారీ చేశారు. కరువు కాటకాలు రాకముందే జల సంరక్షణకు పక్కా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. రాజస్థాన్ జల పాఠాలు.. మహారాష్ట్ర నీటి బాటలు అధ్యయనం చేసి తెలంగాణలోనూ అమలు చేయాలన్నారు. అవసరమైతే కేటాయించిన బడ్జెట్‌కు మించి నిధులిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అధికారులతో ప్రత్యేక భేటీలు పెట్టి భూగర్భ జలాల పరిస్థితిపై రిపోర్టులు తెప్పించాలని ఆదేశించారు. మొత్తానికి బోర్లలో నీళ్లు అడుగంటకుండా.. భవిష్యత్ తరాలకు నీటి గ్యారంటీ ఇవ్వడమే సర్కారు టార్గెట్!





మదర్సాలో మాసాబ్ మాస్క్ తొలగిందా..?

పదకొండేళ్ల బాలుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు.. పోక్సో కేసుతో పోలీసుల ఎంట్రీ!

హైదరాబాద్, నవంబర్ 05

:పాతబస్తీలో దారుణ ఆరోపణలు కలకలం రేపినయ్ భాయ్! మదన్నపేట పరిధిలోని కుర్మగూడ మదర్సాలో అరబిక్ పాఠాలు చెప్పే మౌల్సాబ్‌పై 11 ఏళ్ల బాలుడిని లైంగికంగా వేధించాడనే ఫిర్యాదు వచ్చింది. మొబైల్‌లో అశ్లీల దృశ్యాలు చూపించి, అసభ్యంగా ప్రవర్తించి, విషయం బయటపెడితే బెదిరించినట్లు బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడు మాసి హుజ్జామాపై బీఎన్ఎస్ సెక్షన్లు, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలుడి వాంగ్మూలం తీసుకుని భరోసా కేంద్రానికి తరలించారు. ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిన్నారుల భద్రతపై ఈ ఘటన తీవ్ర ఆందోళన రేపుతోంది.

ఓటు కోసం ఇక ఎస్ఐఆర్ లొల్లి అక్కర్లే !

ఫారం--6 నుంచి డిక్లరేషన్ డీ లింక్.. ఈసీ కొత్త రూల్స్ అమలు!

వెబ్ డెస్క్ నవంబర్ 05:



కొత్త ఓటు కావాలంటే ఇక ఆన్‌లైన్‌లో ఫారం--6 నింపితే చాలు.. ఎస్ఐఆర్ డిక్లరేషన్ తలనొప్పిని ఈసీ పక్కకు పెట్టింది. ఫారం--6తో దానికి లింకు కట్ చేసి, విడిగా సమర్పించేలా కొత్త విధానం తెచ్చింది. ఈ రూల్ అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుందని స్పష్టం చేసింది. అటు అధికారుల మీటింగులకు ముందే అజెండా.. తర్వాత మినిట్స్ తప్పనిసరి. విదేశీ టూర్లకు ఈసీ పర్మిషన్ కూడా కంపల్సరీ చేసింది. కొత్త ఐటీ మాడ్యూళ్లకు ప్రత్యేక కమిటీ స్క్రూటినీ తర్వాతే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. మొత్తానికి ఎన్నికల సంఘంలో పారదర్శకతకు కొత్త పంచ్ ఇచ్చింది.



ఆర్ఆర్ ట్యాక్స్..

బీజేపీకి బీటీ పెట్టిన కేటీఆర్!

మోదీ సాబ్.. అమిత్ షా భాయ్.. విమర్శలేనా..? యాక్షన్ ఏదీ!

హైదరాబాద్, నవంబర్ 05:

తెలంగాణ రాజకీయాల్లో ఆర్ఆర్ ట్యాక్స్ పంచాయితీ మళ్లీ హాట్ టాపిక్ అయింది.. చదరపు అడుగుకు రూ.200 వసూళ్లంటూ రియల్ ఎస్టేట్ వర్గాల్లో టాక్ నడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా రేవంత్ సర్కారుపై గాండ్రించే మోదీ, అమిత్ షాలు.. మరి చర్యలకు ఎందుకు జంకుతున్నారని నిలదీశారు. కాంగ్రెస్‌తో బీజేపీకి లోపాయికారీ దోస్తీ ఉందా అంటూ డౌట్ లేవనెత్తారు. ఆరోపణలు నిజమైతే విచారణకు ఆదేశించాలే గానీ, మైకుల ముందు డైలాగులెందుకు అని ప్రశ్నించారు. అటు కాంగ్రెస్ ఖండన.. ఇటు బీజేపీ విమర్శలు.. మధ్యలో బీఆర్ఎస్ కౌంటర్లతో తెలంగాణ పాలిటిక్స్ హీటెక్కినయ్.

కరువొచ్చినా కంగారుండదు .. డెడ్ స్టోరేజీ నుంచే నీళ్లు!

ఎస్ఎల్బీసీ పూర్తయితే శ్రీశైలం నీళ్లతో పాలాలకు జలకళ.. కోమటిరెడ్డి భరోసా!

హైదరాబాద్, నవంబర్ 05



:ఎంత కరువు వచ్చినా రైతన్నకు నీటి కష్టాలు రానివ్వమంటున్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయితే శ్రీశైలం డెడ్ స్టోరేజీ నుంచీ నీళ్లు లిఫ్ట్ చేసి పొలాలకు పారిస్తామన్నారు. గత పాలకుల హయాంలో ఆగిన పనులకు మళ్లీ స్పీడు పెంచామన్నారు. బ్రాహ్మణ వెల్లెంల ద్వారా ఇప్పటికే 35 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, లక్ష ఎకరాల లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఏఎంఆర్పీ కాలువల లైనింగ్‌కు రూ.450 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కాలువలు, రిజర్వాయర్లు పూర్తయితే బోర్లకూ రీచార్జ్ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

వీసా రూల్స్‌కు కేంద్రం రిపేర్లు..

విదేశీయులకు అప్లికేషన్ ఇక ఈజీ !

13 కేటగిరీలు 9కి కట్.. ఫారమ్ భారం 70 శాతం తగ్గింపు ప్లాన్!

వెబ్ డెస్క్ నవంబర్ 05:



భారత్ వీసా సిస్టమ్‌కు కేంద్రం కొత్త లుక్ ఇస్తోంది.. విదేశీయులు, ఎన్నారైలకు వీసా ప్రాసెస్ ఇక ఫాస్ట్.. ఫార్మాలిటీస్ లైట్ చేయాలని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఉన్న 13 వీసా కేటగిరీలను 9కి, 49 ఉప విభాగాలను 23కి కుదించే యోచనలో ఉంది. అప్లికేషన్ ఫారమ్‌లో వివరాల భారం ఏకంగా 70 శాతం తగ్గించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. పాత 2019 వీసా మాన్యువల్‌కు గుడ్‌బై చెప్పి, 2027 నాటికి కొత్త డిజిటల్ రూల్స్ అమల్లోకి తెచ్చే కసరత్తు జరుగుతోంది.

ట్రంప్ ఓటమి ఎఫెక్ట్.. వాన్స్ కొత్త రాజకీయ గేమ్!

వెబ్ డెస్క్ నవంబర్ 05




:అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఎదురుదెబ్బతో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కొత్త వ్యూహానికి తెరతీసినట్లు కథనాలు. 2028 అధ్యక్ష ఎన్నికలే టార్గెట్‌గా ట్రంప్‌పై అసంతృప్తి ఉన్న ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇరాన్ యుద్ధం ముగింపు, ధరల నియంత్రణ, అమెరికా ఫస్ట్ విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అయితే ట్రంప్‌కు వ్యతిరేకంగా కాదని ఆయన వర్గం స్పష్టం చేసింది.

మెట్రో రైళ్లకు మోదీ సర్కార్ స్పీడు..

ఐదు నగరాల నుంచి 26 నగరాలకు దూకుడు!

వెబ్ డెస్క్, నవంబర్ 05:దేశంలో మెట్రో నెట్‌వర్క్ పరుగులు పెడుతోందని ప్రధాని మోదీ తెలిపారు. 2014లో 248 కిలోమీటర్లుగా ఉన్న మెట్రో మార్గాలు ఇప్పుడు దాదాపు 1,200 కిలోమీటర్లకు చేరాయని, 26 నగరాల్లో సేవలు అందుతున్నాయని వెల్లడించారు. రోజూ కోటి మందికి పైగా ప్రయాణమంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. పుణెలో రూ.8,300 కోట్లతో నిర్మించిన 23 కిలోమీటర్ల పింక్ లైన్‌ను ప్రారంభించడంతో పాటు కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు.



ద్రగ్స్ దందాకు డెడ్ ఎండ్.. యువతకు పోలీసుల సేఫ్టీ మెసేజ్!

ఐఎఫ్‌హెచ్ఈ--ఫ్యూచర్ సిటీ పోలీసుల జాయింట్ ఆపరేషన్.. ద్రగ్స్ రహిత క్యాంపస్‌కు ప్రతిజ్ఞ!

హైదరాబాద్, నవంబర్ 05: యువత భవిష్యత్తుతో ఆటలాడే ద్రగ్స్ మహమ్మారికి చెక్ పెట్టేందుకు ఐఎఫ్‌హెచ్ఈ, ఫ్యూచర్ సిటీ పోలీసులు జాయింట్‌గా రంగంలోకి దిగారు. క్యాంపస్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్, ఎస్పీ పి. సీతారాం ద్రగ్స్ అక్రమ రవాణా, సరఫరా నెట్‌వర్క్‌లపై వివరించారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ. వినయ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. విజయలక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ ఎస్. వేణుగోపాల్ రావు, ప్రొఫెసర్ విజయేందర్ కుమార్, ప్రొఫెసర్ సి.ఎస్. శైలజన్ విద్యార్థులకు అండగా నిలిచారు. ఏసీపీ బి. కిషన్, మొకిల ఎస్‌హెచ్‌వో ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఆర్. లక్ష్మణ్, సి. పద్మతో పాటు మొకిల పోలీస్ సిబ్బంది సేవలను అభినందించారు. నజారియా క్లబ్ కవరేజ్ పార్ట్‌నర్‌గా, ఐబీఎస్ ఐనానా క్లబ్ రిసోర్స్ పార్ట్‌నర్‌గా సహకరించాయి. చివర్లో విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, సమాజంలో అవగాహన పెంచుతామని ప్రతిజ్ఞ చేశారు.



ఉద్యమాల వేగుచుక్క జెసిఎస్ ప్రసాద్.





పిడిఎస్ యూ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో భారీ విద్యార్థి ప్రదర్శన.

వేగుచుక్క న్యూస్, బోధన్:

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క జంపాలా చంద్రశేఖర్ ప్రసాద్ అని, పాలకులు జంపాల ప్రసాద్ ను భౌతికంగా లేకుండా చేశారు కానీ, ఆయన ఆశయాలను చంపలేక పోయారని పిడిఎస్ యూ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్ అన్నారు. జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 50 ఏళ్ల అమరత్వ స్ఫూర్తి ర్యాలీ గురువారం బోధన్ పట్టణంలో శక్కర్ నగర్ చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పి డి ఎస్ యూ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్. గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్ లు మాట్లాడుతూ, ఫ్రెంచ్ విద్యార్థుల తిరుగుబాటు , నక్సల్బరీ శ్రీకాకుళ ఉద్యమ పోరాటాల వెల్లువలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్భవించిన పిడిఎస్ యూ విద్యార్థి సంఘం, ఉస్మానియా యూనివర్సిటీ కేంద్ర ఉన్న విద్యార్థి ఉద్యమాన్ని జార్జ్ రెడ్డి వారసత్వాన్ని జంపాలా చంద్రశేఖర్ ప్రసాద్ భుజాన వేసుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంఘ నిర్మాణాన్ని చేశారని అన్నారు. విద్యారంగ సమస్యలు హక్కుల కోసం పోరాటం చేశారని , సమానతలు లేని సమాజం కోసం ,శాస్త్రీయ సాధన కోసం ఉద్యమించాడని అన్నారు. పాలకులు ఎమర్జెన్సీ కాలంలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ను హతమార్చారని , ఆయన మరణించి 50 ఏండ్ల గడిచిన ఆయన ఆశయాలు ఇంకా సజీవంగా ఉన్నాయని అన్నారు.నేడు దేశంలో విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టు మిట్టడుతున్నారని , ఢిల్లీ బీహార్ లాంటి ప్రాంతాల్లో విద్యార్థుల జెన్ జీ ఉద్యమాలు ఉవ్వెత్తున నడుస్తున్నాయని, ప్రశ్నించే గొంతులపై ఆనాడు, నేడు పాలకులు నిర్బంధం నిరంతరం కొనసాగిస్తున్నారని , నిర్బంధాలను ఎదుర్కొంటూ 50 ఏండ్ల విద్యార్థి ఉద్యమంలో విద్యా రంగంలో అనేక మార్పులు జరిగాయని , జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని ఆయన స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

పిడిఎస్ యు మాజీ రాష్ట్ర కార్యదర్శి అడ్వకేట్ జి. శ్రీనివాస్ గ మాట్లాడుతూ

ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతూ ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ ఆనాడు ఇందిరా కాంగ్రెస్ కొనసాగిస్తూ నిర్బంధాన్ని ప్రయోగించి పిడిఎస్ నిర్మాత జంపాల ప్రసాదును టీచర్ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్యను విజయవాడలో పట్టుకొని ఖమ్మం జిల్లా ఇల్లెందు తాలూకా చీకటి గండ అడవుల్లో కాల్చివేశారని వారి హత్యను ఖండిస్తూ

దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమం విస్తరించిందని వారు పేర్కొన్నారు జంపాల ప్రసాద్ లాంటి త్యాగజీవి మన బోధన్ ఎత్తుండా గ్రామానికి చెందిన వారు కావడం గర్వకారణమని వారు పేర్కొన్నారు వారి ఆశయ సాధన కోసం సమ సమాజ స్థాపన కోసం శాస్త్రీయ విద్యాసాధన కోసం సమానమైన విద్య కోసం విద్యార్థులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు పాలకులు మారిన వారి విధానాలు మారలేవని వారి ఎండగట్టారు పాలకులు అనుసరిస్తున్న విధానాలపై పోరాడాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ కార్తీక్, సహాయ కార్యదర్శి ట్రిన్స్, కోశాధికారి సాయినాథ్, జిల్లా కమిటీ సభ్యులు పవన్, భవాని, ఆకాష్, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.